



మంత్రి అనితకు శుభాకాంక్షలు తెలుపుతున్న కోటవురట్ల టీడీపీ నేతలు

అనిత అనే నేను..

మంత్రివర్గంలో పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితకు అవకాశం

- ఉమ్మడి జిల్లా నుంచి ఒక్కరికే ఛాన్స్
- ఉపాధ్యాయురాలి నుంచి మంత్రి స్థాయికి...
- 2014లో మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నిక
- ఇటీవల ఎన్నికల్లో భారీ మెజారిటీతో రెండోసారి విజయం



మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న వంగలపూడి అనిత

అనకాపల్లి/పాయకరావుపేట, జూన్ 12:

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి కేవలం ఒక్కరికి మాత్రమే రాష్ట్ర కేబినెట్‌లో స్థానం దక్కింది. పాయకరావుపేట నుంచి టీడీపీ తరపున రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన వంగలపూడి అనితను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆమె తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా వైసీపీ అక్రమాలు, అన్యాయాలపై చేసిన పోరాటానికి ఫలితంగా మంత్రి పదవి లభించిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సామాజిక వర్గం కూడా కొంతవరకు దోహదపడింది. చక్కటి వాక్చాతుర్యం, ఉన్నత విద్య, ధైర్యంగా మాట్లాడగల నేర్పు.. ఇవన్నీ ఆమెకు ప్లస్ పాయింట్లుగా మారాయి.



వంగలపూడి అనితతో మంత్రిగా ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, వేదికపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, తదితరులు

కుటుంబ నేపథ్యం...

ఉమ్మడి విశాఖ జిల్లా సబ్బవరంలో వంగలపూడి అప్పారావు, స్నేహలత దంపతులకు 1979 మార్చి 24న అనిత జన్మించారు. ప్రాథమిక విద్య నుంచి ఇంటర్మీడియట్ వరకు సబ్బవరంలో చదువుకున్న ఆమె డిగ్రీ అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో చేశారు. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ చేసి బీఈడీ పూర్తిచేశారు. ఆ తరువాత ఎంఈడీ చేశారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలిగా పాయకరావుపేట మండలం గజపతినగరం, నర్సీపట్నం మండలం వేములపూడి పాఠశాలల్లో పనిచేశారు. అనంతరం పదోన్నతిపై ఓపెన్ స్కూల్స్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తూ ఉద్యోగానికి రాజీనామా చేసి, 2013లో తెలుగుదేశం పార్టీలో చేరారు. నియోజక ఇన్‌చార్జిగా నియమితురాలైన ఆమె 2014 ఎన్నికల్లో పోటీ చేసి 2,828 ఓట్ల మెజారిటీతో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. పార్టీలో చక్కటి వాక్చాతుర్యం కలిగిన నేతగా గుర్తింపు పొందారు. 2018లో టీటీడీ బోర్డు మెంబరుగా అనితకు అవకాశం వచ్చినప్పటికీ, అప్పట్లో దానిపై వివాదం తలెత్తడంతో ఆమె ప్రమాణ స్వీకారం చేయకుండా స్వచ్ఛందంగా తప్పుకున్నారు. 2019 ఎన్నికల్లో అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా ఆమె కొవ్వూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ తరువాత నుంచి పాయకరావుపేట ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు. 2021లో తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా, అనంతరం పొలిట్ బ్యూరో సభ్యురాలిగా నియమితులైన ఆమె పార్టీ తరఫున ఎన్నో కార్యక్రమాలు సమర్థంగా చేపట్టారు. వైసీపీ ప్రభుత్వంలో పోలీసులు ఎన్ని కేసులు పెట్టినా వెరవకుండా సమస్యలపై పోరాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పాయకరావుపేట నుంచి మరోమారు పోటీ చేసిన ఆమె 43,727 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. ఆమె సేవలకు గుర్తింపుగా చంద్రబాబునాయుడు మంత్రివర్గంలోకి తీసుకున్నారు. దీంతో పాయకరావుపేట నియోజకవర్గానికి తొలిసారి మంత్రి పదవి లభించినట్టయ్యింది

ఇదీ ప్రస్థానం

విద్యావంతురాలైన వంగలపూడి అనిత ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ప్రజలకు సేవ చేయాలన్న ఆశయంతో ఉద్యోగానికి రాజీనామా చేసి, 2013లో తెలుగుదేశం పార్టీలో చేరారు. 2014 ఎన్నికల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పాయకరావుపేట నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మరోమారు అక్కడి నుంచి పోటీ చేసి భారీ మెజారిటీతో గెలుపొందారు. బుధవారం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వంలో అనిత మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

విధేయతకు పట్టం

'పేట'లో సరికొత్త చరిత్ర ▸▸ నియోజకవర్గానికి తొలిసారి మంత్రి పదవి

నక్కపల్లి, జూన్ 12: పార్టీ పట్ల విధేయత, విశ్వసనీయత, కష్టకాలంలోనూ సమర్థంగా బాధ్యతల నిర్వహణ, ప్రభుత్వ అరాచకాలపై గొంతెత్తిన వైనం... కేడర్‌కు అండగా నిలిచి, వారికి సరైన మార్గనిర్దేశం చేసి ముందుకు నడిపించిన తీరు... నిర్బంధాలు, కేసులకు వెరవని తెగువ... ఇదీ వంగలపూడి అనిత రాజకీయ ప్రస్థానం. జగన్ పాలనలో ఎంతోమంది మహామహులు నోరు విప్పడానికి భయపడే స్థితిలో వైసీపీ పాలకులపై విరుచుకుపడేవారు. దీంతో టీడీపీలో ఫైర్ బ్రాండ్‌గా పేర్గాంచారు. పసుపు జెండాయే అజెండాగా భావించారు. జగన్ పాలనలో వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు, ఆరోపణలు చేసేందుకు పార్టీలో సీనియర్లు కూడా సాహసించలేని సందర్భంలో ఆమె వెరవలేదు. నేనున్నానంటూ పార్టీ కోసం రోడ్డెక్కారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా అవకాశం దక్కడంతో ఆమె రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ అరాచకపాలనపై నిప్పులు చెరిగారు. ఎక్కడ ఎవరికి అన్యాయం జరిగితే అక్కడ వాలిపోయేవారు. బాధితులను పరామర్శించి, ధైర్యం చెప్పడమే కాకుండా టీడీపీ శ్రేణులను ఉత్సాహపరిచేవారు. ఒకానొక దశలో వైసీపీ ప్రభుత్వం అనితపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి నవ్వుల పాలయింది. నియోజకవర్గంలో పర్యటించకుండా పోలీసులతో కలిసి ఆంక్షలు విధించారు. ఎన్ని ఇబ్బందులు, అవమానాలు ఎదురైనా వాటిని ఎదుర్కొని నిలబడ్డారు. పాయకరావుపేట నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

సీనియర్లను కాదని..

ఉమ్మడి విశాఖ జిల్లాలో గంటా శ్రీనివాసరావు, అయ్యన్నపాత్రుడు, వెలగపూడి రామకృష్ణబాబు, కొణతాల రామకృష్ణ, పల్లా శ్రీనివాసరావు లాంటి సీనియర్లు విజయం సాధించారు. దీంతో మంత్రి మండలిలో పాయకరావుపేటకు అవకాశం దక్కుతుందా అనే అనుమానం ఉండేది. అయితే అందరి అంచనాలను తలకిందులు చేస్తూ చంద్రబాబు కొలువులో తొలిసారి స్థానం దక్కింది.

సేవే పరమావధిగా పనిచేస్తా!



అనకాపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సేవే పరమావధిగా పనిచేసి, రాష్ట్రాభివృద్ధిలో తనవంతు బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తానని మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. విజనరీ లీడర్ నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసే అవకాశం లభించడం పూర్వజన్మ సుకృతమన్నారు. మంత్రిగా బుధవారం ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఆమె 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడారు. చంద్రబాబు కల్పించిన అవకాశానికి జన్మజన్మలూ రుణపడి ఉంటానన్నారు. ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న తనకు రాజకీయంగా ఎదిగేందుకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించడమే కాకుండా, గతంలో ఎమ్మెల్యేగా, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో మంత్రిగా సముచితస్థానం కల్పించిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ జాతీయ కార్యదర్శి మంత్రి నారా లోకేశ్‌కు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలు అపూర్వ విజయాన్ని అందించారని, మంత్రిగా వారి సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానన్నారు. సాధారణ మహిళపై పూర్తి నమ్మకంతో ప్రజలకు సేవ చేసేందుకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించి, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

బడికి వేళాయె!

నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం

అనకాపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి):



వేసవి సెలవులు ముగిశాయి. జిల్లాలో గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభమయ్యేలా జిల్లా విద్యాశాఖాధికారి ఎంవీ లక్ష్మమ్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. వాస్తవానికి వేసవి సెలవులు ఈనెల 11తో ముగిశాయి. 12న పాఠశాలలు ప్రారంభం కావాల్సి వుంది. కానీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం జరగడంతో పాఠశాలల పునఃప్రారంభం గురువారానికి వాయిదా పడింది. జిల్లాలో 1,885 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 2,22,787 మంది బాలబాలికలు చదువుకుంటున్నారు. ఇప్పటికే 2,53,797 విద్యార్థి కిట్లను పంపిణీ చేశారు. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు, యూనిఫారం కిట్లలో ఉంటాయని, వీటిని విద్యార్థులకు త్వరలోనే పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని డీఈఓ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

మౌలిక వసతులు అంతంతే..

జిల్లాలోని పాఠశాలల రూపురేఖలు మారుస్తామంటూ గత ప్రభుత్వం చేపట్టిన నాడు నేడు పనులు అంతంతమాత్రంగానే సాగాయి. సకాలంలో నిధులు విడుదల చేయక పనులు నిలిచిపోయాయి. దీంతో ఆయా చోట్ల మౌలిక వసతులు మృగ్యమవుతున్నాయి. వేసవి సెలవులకు ముందే నిర్మాణ పనులు పూర్తిచేయాల్సి ఉన్నా వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు చెబుతున్నారు. నాడు, నేడు పథకం కింద పాఠశాలల్లో మరుగుదొడ్లు, అదనపు గదులు, ప్రహరీ గోడల నిర్మాణ పనులను పూర్తిచేసేందుకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరగలేదు. దీంతో ఆరు నెలల కిందటే పనులు ప్రారంభించిన 280కిపైగా నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సగానికి పైగా నిర్మాణాలు అరకొరగానే ఆగిపోయాయి. కొన్నిచోట్ల పనులు తుది దశకు చేరినా పాఠశాలల పునః ప్రారంభోత్సవం నాటికి విద్యార్థులకు అందుబాటులోకి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు.

కూటమి శ్రేణుల సంబరాలు

వివిధ ప్రాంతాల్లో ఎల్ఈడీ స్క్రీన్లపై ప్రత్యక్ష ప్రసారం

- ప్రభుత్వ కార్యాలయాల్లో వీక్షించిన అధికారులు, ప్రజలు

పాయకరావుపేట, జూన్ 12:

రాష్ట్ర ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, మంత్రులుగా పవన్‌కల్యాణ్, వంగలపూడి అనిత బుధవారం ప్రమాణం చేయడంతో టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు, సంబరాలు జరుపుకున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అనితకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎన్డీఏ కూటమి కార్యాలయం ఎదుట బాణసంచా కాల్చారు. ఇంజరపు సూరిబాబు, సీహెచ్.పేర్రాజు, ఐఎస్.మూర్తి, పెంకే శ్రీను, కువల కుమార్, కర్రి శ్రీను, ముక్కుడుపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో ఎల్ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. ప్రమాణోత్సవాన్ని ఎంపీడీవో కె.స్వప్న, ఈఓ పీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది వీక్షించారు.

పాయకరావుపేట రూరల్: మండలంలోని సత్యవరం, మాసాహెబ్‌పేట, మంగవరం, గోపాలపట్నం, పెదరాంభద్రపురం, గుంటపల్లి, శ్రీరాంపురం, వెంకటనగరం, అరట్లకోట, పాల్తేరు, నామవరం, సీతారాంపురం, కుమారపురం, తదితర గ్రామాల్లో కార్యకర్తలు బాణసంచా కాల్చి, కేకులు కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. టీడీపీ నేతలు కంకిపాటి వెంకటేశ్వరరావు, గణపర్తి దొరబాబు, గోపిరాజు, కె.సతీష్‌రాజు, కీర్తి సీతారాం, పెదిరెడ్డి శ్రీరాములు, బొలిశెట్టి నాగేశ్వరరావు, కూలి నానాజీ, కె.రాజు, శింగంశెట్టి నాగేశ్వరరావు, తాడి నానాజీ, సత్తిబాబు, కొండబాబు, గన్నియ్య, జనసేన నేతలు గోళ్ళ సన్యాసిరావు, మంచిగంటి రాజు పాల్గొన్నారు.



నునపర్తిలో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు



విశాఖలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఏర్పాటుచేసిన బిగ్ స్క్రీన్‌పై చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షిస్తూ పూలు చల్లుతున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు

అచ్యుతాపురం: నూతన మంత్రివర్గం ప్రమాణ స్వీకారంతో కూటమి శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. నునపర్తిలో టీడీపీ నేత రెడ్డి నగేష్ కేక్ కట్‌చేశారు. రెడ్డి సన్యాసినాయుడు, గొంప నరసింహనాయుడు, శ్రేణులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో...

రాంబిల్లి: కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని రాంబిల్లి ప్రధాన జంక్షన్‌లో తెలుగు తమ్ముళ్లు ఎల్ఈడీ స్క్రీన్‌పై వీక్షించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. నేతలు కశిరెడ్డి ప్రసాద్, కలిదిండి రఘురాజు, చోడిపల్లి సత్యనారాయణ, కర్రి సింహగిరి ప్రసాద్, చింతకాయల ఎర్రయ్య, బి.రమణ, చెల్లూరి దేముడు, ఉమ్మిడి నాగేష్, చోడిపల్లి మంగరాజు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్యాలయంలో ఎల్ఈడీ స్క్రీన్‌లు

ఎలమంచిలి: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌లపై జనం వీక్షించారు. డ్వాక్రా మహిళలు సంబరాలు చేసుకున్నారు. మునిసిపల్ అధికారులు, కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.

కొత్తూరు కూడలిలో...

కొత్తూరు: అనకాపల్లి పట్టణంలోని కొత్తూరు కూడలిలో కూటమి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. సత్తిబాబు, శ్రీను, నూకరాజు, నాగరాజు, శ్రీను, వాసురాజు, సత్తిబాబు, గోవింద పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో...

కశింకోట: కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం సందర్భంగా టీడీపీ నాయకులు గొంతిన చిరంజీవి, ఆంద్రా ప్రసాద్ తదితరుల ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి సంబరాలు జరిపారు. స్వీట్లు పంపిణీ చేశారు. నూకునాయుడు, రవికుమార్, నాగేశ్వరరావు, బాబూరావు, గోవింద, శివకృష్ణ, ఏసు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం: ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఎంపీడీవో కార్యాలయంలో ఎల్ఈడీ స్క్రీన్‌పై అనేకమంది వీక్షించారు. ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, తహసీల్దార్ జయలక్ష్మి, ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పాలకవర్గ సభ్యులకు ఆహ్వానం పంపినా హాజరుకాలేదని ఎంపీడీవో తెలిపారు.

మంత్రికి నేతల శుభాకాంక్షలు

కోటవురట్ల: మంత్రిగా వంగలపూడి అనిత ప్రమాణస్వీకారోత్సవాన్ని వీక్షించేందుకు మండల టీడీపీ శ్రేణులు విజయవాడ వెళ్లారు. పార్టీ మండలాధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు సుంకర బాబ్జీ, ఎ.ప్రకాష్, తిరుమలరావు, సత్యనారాయణ మంత్రికి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. స్థానిక కూడలిలో కూటమి శ్రేణులు బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

ఆరోగ్య శాఖలో పోస్టుల భర్తీపై విచారణ

2019 నుంచి 2023 మధ్య చేపట్టిన నియామకాలపై ఓ అధికారి ఫిర్యాదు

- విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు
- అనకాపల్లి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలాజీకి బాధ్యత

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో 2019 నుంచి 2023 మధ్య కాలంలో అనేక పోస్టులను అడ్డగోలుగా భర్తీ చేశారంటూ కొద్దిరోజుల కిందట రాష్ట్ర ప్రభుత్వానికి ఒక అధికారి ఫిర్యాదు చేశారు. ఉమ్మడి జిల్లా ఆరోగ్య శాఖ కార్యాలయం కేంద్రంగా నేషనల్ హెల్త్ మిషన్ తోపాటు వివిధ ప్రోగ్రామ్‌లలో భాగంగా చేపట్టిన సుమారు రెండు వేలకుపైగా పోస్టుల భర్తీలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణకు అనకాపల్లి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలాజీని ప్రభుత్వం నియమించింది. ఆయన బుధవారం విచారణ చేపట్టారు. అనకాపల్లి ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరిగిన ఈ విచారణకు గతంలో విశాఖ ఆరోగ్య శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన అధికారి, ప్రస్తుతం ఆరోగ్య శాఖ కార్యాలయంలోనే పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్, మరో కిందిస్థాయి ఉద్యోగి హాజరైనట్టు తెలిసింది. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు సంబంధించిన సమాచారాన్ని, పోస్టుల భర్తీ సందర్భంగా అనుసరించిన రోస్టర్, ఇతర వివరాలను విచారణ అధికారి తెలుసుకున్నారు. ఫిర్యాదు చేసిన ఉద్యోగి విచారణకు హాజరుకాలేదని తెలిసింది. దీంతో మరోసారి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని నిర్ణయించారు. ఫిర్యాదులో అనేక అంశాలు పేర్కొన్నప్పటికీ.. వాటికి సంబంధించిన ఆధారాలు సమర్పించాల్సి ఉంది. దీనిపై ఇప్పటికే ఫిర్యాదు చేసిన అధికారికి సమాచారం అందజేశారు. ఆయా వివరాలను సమర్పిస్తే మరింత లోతుగా విచారణ చేసేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని, ఆ తరువాతే వివరాలు వెల్లడిస్తామని విచారణ అధికారి డాక్టర్ బాలాజీ తెలిపారు.

ఆరోపణలు ఎన్నో..

వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నీషియన్‌తోపాటు ఇతర పోస్టులు భర్తీ చేసినప్పుడు అనేక ఆరోపణలు వచ్చాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో రెండు, మూడుసార్లు నోటిఫికేషన్లు రద్దు చేసి మళ్లీ తిరిగి ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. అయినప్పటికీ ఈ పోస్టుల భర్తీ వ్యవహారంపై ఫిర్యాదులు రావడం గమనార్హం. ఈ విచారణలో ఎటువంటి విషయాలు వెలుగులోకి వస్తాయో చూడాల్సి ఉంది.

పాడేరు ఘాట్‌లో ఘోరం

వ్యాన్ బోల్తా: ముగ్గురు మృతి




లోయలో పడిన వ్యాన్‌లోని స్టేజీ, సౌండ్ సిస్టమ్ సామగ్రి

- 11 మందికి తీవ్ర గాయాలు
- మృతులు, బాధితులు అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ప్రాంత వాసులు
- వ్యాన్ బ్రేకులు ఫెయిల్ కావడమే ప్రమాదానికి కారణమని భావిస్తున్న పోలీసులు

...వివరాలు మెయిన్‌లో

గ్రామ దేవతల అనుపోత్సవం

సబ్బవరం, జూన్ 12 : మండల కేంద్రం సబ్బవరం లోని జోడగుళ్ల, గొర్లివానిపాలెంలలో కొలువుదీరిన గ్రామ దేవతలు కుంచాలమ్మ, బంగారమ్మతల్లి అనుపోత్సవం గురువారం ఘనంగా జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు.



నేడు ఎమ్మెల్యే పంచకర్ల జన్మదిన వేడుకలు

» పెందుర్తిలో భారీ ఏర్పాట్లు » పలు సేవా కార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు

పెందుర్తి/పరవాడ, జూన్ 12 : పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించి నియోజకవర్గ పరిధిలో గల పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాల్లోని కూటమి పార్టీలైన జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఇందు కోసం వేపగుంట సమీపం చీమలాపల్లి దరి మీనాక్షి కన్వెన్షన్‌లో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వర్గాలు తెలిపాయి. గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు మీనాక్షి కన్వెన్షన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పంచకర్ల హాజరై కేక్ కట్‌చేస్తారన్నారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి ప్రసంగిస్తారు. మెగా రక్తదాన శిబిరంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జనసేన నేతల ఆధ్వర్యంలో వృద్ధులకు అన్న దానంతో పాటు రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయనున్నారు. ఇదిలావుంటే, నియోజకవర్గంలోని ప్రధాన కూడళ్లలో అభిమానులు, పార్టీల శ్రేణులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల జన్మదిన వేడుకలను అంతా విజయవంతం చేయాలని క్యాంపు కార్యాలయం వర్గాలు పిలుపునిచ్చాయి.



పంచదార్లలో దుర్గాలమ్మ జాతర

రాంబిల్లి, జూన్ 12 : పంచదార్లలో దుర్గాలమ్మ జాతర గురువారం జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. గ్రామాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.





సత్యనారాయణ దేవస్థానం పాలకవర్గం రాజీనామా

అనకాపల్లి టౌన్, జూన్ 12 : ఇక్కడి సుంకరమెట్ట జంక్షన్‌లోని రమా సమేత సత్యనారాయణస్వామి, సూర్యనారాయణస్వామి ఆలయ పాలకమండలి బుధవారం రాజీనామా చేసింది. ఈ మేరకు ఆలయ ఈవోకు ఛైర్మన్ కర్రి మహాలక్ష్మినాయుడు, ధర్మకర్తలు పెంటకోట అప్పలనాయుడు, విజ్జపు వాసు ముకుంద, మారిశెట్టి శ్రీను, తాడి నాగలక్ష్మి, తగరంపూడి నరసింగరావులు తమ రాజీనామా పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో వైసీపీ ఓటమి చెందడంతో తమ పాలకవర్గం రాజీనామా చేసినట్టు వారు తెలిపారు.

'రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలి'

అనకాపల్లి టౌన్, జూన్ 12 : రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక హోదా కల్పించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని గాంధీనగరం మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులు చేతబట్టి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం లేదని ప్రధాని హామీ ఇవ్వాలన్నారు. ప్రస్తుతం కేంద్రంలో అత్యంత కీలక స్థానంలో ఉన్న తెలుగుదేశం పార్టీ మరింత చొరవ చూపి రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బోయిన భానుమూర్తి యాదవ్, కాళ్ల సత్యనారాయణ, సేనాపతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ఏఎంఏఎల్'కు నాక్ గుర్తింపు వచ్చేలా కృషి


కొత్తూరు, జూన్ 12 : ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలకు నాక్ గ్రేడింగ్‌లో గుర్తింపు వచ్చేలా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేడ అప్పారావు, పెనుమత్స కృష్ణంరాజు పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘ వార్షికోత్సవాన్ని త్వరలోనే చేపట్టాలని నిర్ణయించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సమావేశంలో కోశాధికారి వై.జగదీశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు, సూపరింటిండెంట్ పి.అనురాధ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనుల పరిశీలన

పాయకరావుపేట రూరల్, జూన్ 12 : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో కె.స్వప్న కార్యదర్శులను ఆదేశించారు. మంగవరం గ్రామంలో చేపట్టిన పారిశుధ్య పనులను బుధవారం ఆమె పరిశీలించారు. కాలువల్లో పూడిక తొలగించాలని, రోడ్లపై చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు సందప కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ఈవోపీఆర్‌డీ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కళ్యాణ్, పంచాయతీ కార్యదర్శి జె.నరేశ్, వంగలపూడి రామారావు, కోనే కొండబాబు పాల్గొన్నారు.







తుమ్మపాలలో ఉచిత కంటి వైద్య శిబిరం

తుమ్మపాల, జూన్ 12 : వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 180కి పరీక్షలు జరిపారు. వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు ఏరుబండి సత్యనారాయణ, గ్రామ నాయకులు డిలీప్‌కుమార్, గణేష్, మహేష్, బాబురావు పాల్గొన్నారు.



చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం

▸▸ న్యాయమూర్తి వీర రాఘవేంద్రరావు

కశింకోట, జూన్ 12 : మండలంలోని నర్సింగబిల్లిలో గల జీడిపిక్కల పరిశ్రమలో బుధవారం న్యాయ శాస్త్ర అవగాహన సదస్సు ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఎలమంచిలి అడిషనల్ జడ్జి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ టి.వీర రాఘవేంద్రరావు ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ముఖ్యంగా చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని వివరించారు. సన్ ఫుడ్ ఫ్యాక్టరీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఏజీపీ డి.వెంకట్రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.నూకరాజు, కార్యదర్శి బి.శంకరరావు, ఉపాధ్యక్షుడు పి.వి.రమణ, ఫ్యాక్టరీ యజమాని బి.అనీల్‌కుమార్, కార్మిక శాఖాధికారి ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి వీరరాఘవేంద్రరావు

సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం



నక్కపల్లి, జూన్ 12 : మండల కేంద్రం నక్కపల్లి వెంకటనగర్‌లో సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. అర్చకులు తేజ, భగవాన్,పండుశర్మ లక్ష్మీగణపతి హోమం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నక్కపల్లి, జూన్ 12 : ఉపమాక సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం మరమ్మతు పనుల కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ బుధవారం తెలిపారు.

40 మందికి కంటి ఆపరేషన్లు

అచ్యుతాపురం, జూన్ 12 : బ్రాండిక్స్ ఆధ్వర్యంలో 40 మంది రోగులకు కంటి శస్త్ర చికిత్సలు చేయించారు. ఈనెల తొమ్మిదో తేదీన ఇక్కడ జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 400 మంది రోగులకు వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. ఇందులో నలభై మందికి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. వీరందరికీ విశాఖలో గల శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు చేయించిన అనంతరం బుధవారం ప్రత్యేక వాహనంలో ఎవరి గ్రామాలకు వారిని సురక్షితంగా చేర్చారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

అనకాపల్లి టౌన్, జూన్ 12 : జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు గత రెండు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు వాపోయారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం, నక్కపల్లి, మాడుగుల, చోడవరం, కోటపాడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వీరిపై పనిభారం అధికంగా ఉందన్నారు. గత రెండు నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. నర్సీపట్నం ఆస్పత్రిలో పనిచేసే కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి వివరాలు కూడా అందించడం లేదన్నారు. కనీస వేతనం రూ.16 వేలు ఇవ్వాల్సి ఉండగా ఎక్కడా అమలు చేయడం లేదని ఆరోపించారు. చాలీచాలని జీతాలతో వీరు కుటుంబాలను ఎలా పోషిస్తారని ప్రశ్నించారు. తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఆదిత్య బిర్లా ఇనిస్టిట్యూషన్ రీసోర్సు పర్సన్

డిగ్రీ కళాశాలలో ఎంపవర్‌మెంట్ ప్రోగ్రామ్

చోడవరం, జూన్ 12 : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ సహకారంతో విద్యార్థులకు ఎంపవర్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. విద్యార్థులలో మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకునే దిశగా అవసరమైన సూచనలు ఆదిత్య బిర్లా విద్యాసంస్థల రీసోర్సు పర్సన్లు సుధాకర్, సాయి వంశీలు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విద్యార్థులకు చదువుతో పాటు, శారీరక దృఢత్వం అవసరమని, మానసిక ఒత్తిడి తగ్గించుకోవడానికి ఫిట్‌నెస్ అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధాకృష్ణ, లెక్చరర్లు డాక్టర్ రత్నభారతి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు డి.మాల్యాద్రి, పిచ్చమ, రఫియుద్దీన్, సుధీర్, అప్పలనాయుడు, జ్యోతి, సూర్యవతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావికమతం, జూన్ 12 : రావికమతం, తట్టబంద సబ్ స్టేషన్ల పరిధిలో గురువారం (ఈనెల 13న) విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని నర్సీపట్నం ఈపీడీసీఎల్ డీఈ రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. రావికమతం సబ్‌స్టేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్ పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. దీంతో రావికమతం, తట్టబంద సబ్‌స్టేషన్ల పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ముందుగానే తెలియజేస్తూ ఈఅసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు మరిడిమాంబ అమ్మవారి పండుగ



కృష్ణాదేవిపేట, జూన్ 12 : గొలుగొండ మండలం కొంగసింగి గ్రామదేవతైన మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం జరగనుంది. గ్రామ సర్పంచ్ యలమంచిలి నూకరత్నం, గ్రామపెద్దలు ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ మొక్కులతో పాటు టెంట్లు తదితర అన్ని ఏర్పాటు చేయునున్నారు. ఇప్పటికే గ్రామంలో విద్యుత్ అలంకరణతో ముస్తాబు చేస్తున్నారు. అదే రోజు మధ్యాహ్నం జిల్లాస్థాయి ఎడ్లబండ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ నూకరత్నం, యలమంచిలి వరహాలబాబు, గ్రామపెద్దలు తెలిపారు. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు నిర్వాహకులు చేస్తున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారంతా కోరారు. పండగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. దీనికి ప్రజలు, భక్తులు సహకరించాలని కోరారు.

మద్యం తాగొద్దని మందలించినందుకు ఒకరి ఆత్మహత్య

నర్సీపట్నం, జూన్ 12 : అతిగా మద్యం తాగవద్దని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నర్సీపట్నం మండలం లింగాలపాలెం గ్రామానికి చెందిన బీమిరెడ్డి సురేష్ కుమార్ (34) మద్యానికి బానిసై రోజూ అతిగా మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. మద్యం అలవాటు మానుకో లేక పోవడంతో మంగళవారం ఇంట్లో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మునిసిపాలిటీ పరిధిలోని బలిఘట్టం శివారులోని మద్యం దుకాణం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతిడికి పదేళ్ల బాలుడు, భార్య ఉన్నారు.తండ్రి బీమిరెడ్డి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదుతో పట్టణ ఎస్సై ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి



చోడవరం, జూన్ 12 : అనారోగ్యంతో మండలంలోని జన్నవరం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాట్రపల్లి ఈశ్వరరావు (55) మంగళవారం రాత్రి విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయన విశాఖ నగర పరిధిలోని పెందుర్తి మండలం పులగానిపాలెం స్కూలులో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అంతకుముందు ఎస్‌జీటీగా మండలంలోని బెన్నవోలు, బుచ్చెయ్యపేట మండలంలోని పాఠశాలల్లో పని చేశారు. అనంతరం పదోన్నతిపై పెందుర్తి బదిలీ అయ్యారు. కుటుంబంతో పెందుర్తిలో నివాసం ఉంటున్నారు. ఉపాధ్యాయుడు ఈశ్వరరావుకు కిడ్నీలు పాడవడంతో కొంతకాలంగా డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఈశ్వరరావుకు భార్య జయలక్ష్మితో పాటు ఇద్దరు ఆడపిల్లలు, ఒక బాబు ఉన్నారు. ఈశ్వరరావు మృతి పట్ల ఉపాధ్యాయులు, స్థానిక ప్రముఖ న్యాయవాది ఎడ్ల వెంకటరావు, గ్రామస్థులు సంతాపం తెలిపారు.

బడి ఈడు పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలకు పంపించండి



బడిలో చేర్పించాలని ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

నర్సీపట్నం, జూన్ 12 : బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని వెంకునాయుడుపేట ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు బుధవారం ఇంటింటి ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్నం భోజనం పథకం, ఏకరీతి దుస్తులు, స్కూల్ బ్యాగ్, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఇస్తామని చెపారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్, హెచ్ఎం నీలమాంబ, సునీత, శివ పాల్గొన్నారు.

విత్తనాల ధరల పట్టిక తప్పనిసరి : ఏవో కాంతమ్మ

దేవరాపల్లి, జూన్ 12 : ప్రైవేటు విత్తనాల షాపుల ముందు ఎరువులు, విత్తనాల ధరల పట్టిక విధిగా ఉంచాలని మండల వ్యవసాయ అధికారిణి ఎల్.వై.కాంతమ్మ షాపుల యజమానులను ఆదేశించారు. స్థానిక గ్రోమోర్ పురుగులు, ఎరువుల షాపును బుధవారం ఆమె తనిఖీ చేశారు. తనిఖీ చేసిని విత్తనాల శాంపిల్స్‌ను క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌కు పంపుతామన్నారు.

‘ప్రమాణం’ వేళ.. ఆనందాల హేల

» సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారంతో సంబరాలు » బాణసంచా కాల్పులు, స్వీట్లు పంచిన కూటమి నేతలు



రావికమతంలో కేక్ కట్ చేసి చేస్తున్న కూటమి నాయకులు, కార్యకర్తలు

రావికమతం, జూన్ 12 : ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం పురష్కరించుకొని మండలంలో పలుగ్రామాలలో తెలుగు తమ్ముళ్లు, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు బుధవారం సంబరాలు జరుపుకున్నారు. ఆనందంతో కేరింతలు, జై చంద్రబాబు, జైపవన్ కల్యాణ్, జైలోకేష్‌బాబు, జైకెఎస్‌ఎన్ అంటూ నినాదాలతో భారీ బాణసంచా కాల్చారు. మండల కేంద్రంలో గంజి వారి రామాలయంవద్ద రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, ఎంపీటీసీలు గంజి సూర్యనారాయణ, వేపాడ నాగేశ్వరావు, జనసేన, బీజేపీకి చెందిన తలాటం సూరిబాబు, వీరమళ్ల శ్రీను, పులగాయల సత్యనారాయణ, కొశిరెడ్డి వెంకట సత్యనారాయణ తదితరులు కేక్ కట్ చేసి, మిఠాయిల్లు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంజి వెంకటరమణ, మండల తెలుగు యువత అధ్యక్షులు ఉప్పులూరి నాగేశ్వరావు, వేపాడ శ్రీను, గంజి ఈశ్వరావు, జి.ఎర్రునాయుడు, జి.అప్పలనాయుడు పాల్గొన్నారు.



గుడ్డిపలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

చోడవరంలో ప్రమాణ స్వీకార ఆనందోత్సాహం



గజపతినగరంలో కేక్ కట్ చేస్తున్న గోవాడ షుగర్స్ కార్మిక సంఘం నాయకుడు రామునాయుడు

చోడవరం, జూన్ 12 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకార కార్యక్రమం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఉత్సాహం వెల్లువెత్తింది. కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని కార్యకర్తలు ఉత్సాహంగా జరుపుకున్నారు. లక్ష్మీపురం గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ భూతనాధునానికుమార్ ఇతర నాయకుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద బాణసంచా కాల్చి , మిఠాయిలు పంచి సంబరాలు చేశారు. మండలంలోని గజపతినగరంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు మత్స్యరాజు ఇంటి వద్ద సమావేశమై పార్టీ కార్యకర్తలు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. గోవాడ షుగర్స్ కార్మిక సంఘం నాయకుడు శరగడం రామునాయుడు కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామునాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో విజయోత్సవం



ఎం.అలమండలో కేకులు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

దేవరాపల్లి, జూన్ 12 : చంద్రబాబు ప్రమాణ స్వీకారంతో దేవరాపల్లి, ఎం.అమండ గ్రామాల్లో సంబరాలు జరుపుకున్నారు. కేకులు కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఎం.అమండలో మాజీ ఎంపీపీ పోతల అచ్చియ్యమ్మ, పాత్రునాయుడు, గొర్లె గోవింద, ప్రసాదు తదితరులు పాల్గొనగా మండల కేంద్రంలో పళ్ల దుకాణం నడుపుతున్న జాన దేముడమ్మ, మరికొంత మంది మహిళలు కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మాడుగులలో కూటమి నేతల విజయోత్సాహం



ఎన్టీఆర్ విగ్రహం వద్ద కూటమి నేతలు

మాడుగుల, జూన్ 12 : టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా మాడుగుల కేంద్రంలో బుధవారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలవేసి, బాణసంచాను కాల్చారు. అనంతరం సీట్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడితో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్ పలువురు నేతల ప్రమాణాస్వీరాన్ని తిలకించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎల్ఈడీ స్కీన్ ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో డ్వాక్రా మహిళలు, నాయకులు, కార్యకర్తలు తిలకించారు.

వైసీపీ నాయకుల ఎత్తుగడలను నమ్మవద్దు

ఆస్తులు కాపాడుకునేందుకు వైసీపీ నాయకులు కొంతమంది వేస్తున్న ఎత్తులు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి అధిష్ఠాన నాయకులు నమ్మవద్దని మాడుగుల మండల కూటమి నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద కూటమి నాయకులు విలేఖరులతో మాట్లాడుతూగత ఐదేళ్లలో వైసీపీ అరాచకాలను భరిస్తూ వచ్చామన్నారు. పెట్టిన ఇబ్బందులు మరువలేమని, అయితే గత ఐదేళ్ల కాలంలో భారీగా దోచుకొని ఆస్తులు సంపాదించిన కొంతమంది నాయకులు బీజేపీలోకి చేరేందుకు సన్నాహాలు చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గ మండలాల్లో ఉన్న నాయకులకు చెప్పకుండా వైసీపీకి చెందినవారిని పార్టీలోకి చేర్చుకోవద్దని అన్నారు. ఈ కార్యకమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు రంజిత్‌వర్మ, దంగేటి సూర్యారావు, ఇళ్లపు రమేష్, రొబ్బా మహేష్, పుప్పాల అప్పలరాజు, పి.సూర్యనారాయణరాజు, కొట్యాడ మల్లికార్జునరావు, గౌరీపట్టపు జగన్నాథరావు, త్రినాద్, రమేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆనందోత్సాహం

మాడుగుల రూరల్ : ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబుతో పాటు జనసేన అధినేత పిఠాపురం ఎమ్మెల్యేగా బుధవారం ప్రమాణ స్వీకరణ చేయడంతో మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఉత్సాహంతో సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచి పెట్టారు. బాణసంచా కాల్చారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు మంచి రోజులు వచ్చాయని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

వాడవాడలా టీడీపీ నేతల సందడేసందడి

అయ్యన్నకు మంత్రి పదవి ఇవ్వాలంటూ వినతి

నాతవరం, జూన్ 12 : చంద్రబాబు బుధవారం ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన నేపథ్యంలో మండలకేంద్రం నాతవరం, గుమ్మిడిగొండ తదితర గ్రామాల్లో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మండలకేంద్రం నాతవరం మెయిన్‌రోడ్డులో బాణసంచా కాల్చి 'చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం వద కేక్‌కట్ చేసి కార్యకర్తలకు మిఠాయిలు పంచారు. అలాగే గుమ్మిడిగొండ గ్రామంలో మాజీ సర్పంచ్ సుర్ల వెంకటరమణ చింతకాయల ప్రశాంత్ గాది జమీలు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు.



నాతవరంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

అయ్యన్నకు మంత్రి పదవి ఇవ్వాలి

టీడీపీ కష్టకాలంలో ఉన్నప్పుడు జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా అయ్యన్నపాత్రుడు రాష్టంలో ముందుగా పోరాడిన నాయకుడు అయ్యన్నపాత్రుడు అని అటువంటి నాయకుడికి మంత్రి పదవి ఇవ్వకపోవడం బాధాకరమని మాజీ ఎంపీపీ ఎన్.విజయ్‌కుమార్, తాండవ ప్రాజక్టు కమిటి మాజీ ఛైర్మన్ పారుపల్లి కొండబాబు సినియర్ నాయకులు అపిరెడ్డి మాణిక్యం అన్నారు. బుధవారం వీరు నాతవరంలో విలేకరులతో మాట్లాడుతూ ఒకవైపు టీడీపీ అధికారంలోకి వచ్చిందనినవ్వాలో మరోకవైపు వైసీపీ నాయకులకు అరాచకలకు వ్యతిరేకంగా పోరాడి ఎన్నో కేసులను ఎదుర్కొన్న అయ్యన్నపాత్రుడుకు మంత్రి పదవి ఇవ్వకపోవడంపై ఏడవాలో తెలియటం లేదన్నారు. ఈ సమావేశంలో గ్రామదేశం పార్టీ అధ్యక్షులు శెట్టి నానాజీ, మండల టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షులు బంగారు సూరిబాబు, జీరెడ్డి రాజుబాబు, బళ్లా అశోక్, చింతకాయల శ్రీనువాసరావు, సామర్ల రామారావు సుర్ల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతల సమూహంతో ‘సందీపం’

నర్సీపట్నం, జూన్ 12 : రక్తదాణం ప్రాణదానంతో సమానమని గ్రహించిన నర్సీపట్నానికి చెందిన వీరమాచినేని సందీప్ చౌదరి అడ్మిన్‌గా వీఎస్ఎన్ బ్లడ్ సర్వీసు పేరుతో రెండు వాట్సాప్ గ్రూప్‌లు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి విశాఖ, విజయనగరం, తూర్పు గోదావరి జిల్లాల నుంచి వెయ్యి మందికి పైగా రక్తదాల సమూహాన్ని ఏర్పాటు చేశారు. గ్రూప్ సభ్యులు పలానా గ్రూప్ రక్తం అవసరమని వీఎస్ఎన్ బ్లడ్ సర్వీస్ గ్రూప్‌లో సమాచారం పెడితే గ్రూప్ అడ్మిన్ సందీప్ స్పందిస్తారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి, విశాఖపట్నం, తునిలోని మదర్ బ్లడ్ బ్యాంక్, వైజాగ్‌లోని చత్రపతి శివాజీ బ్లడ్ బ్యాంక్, అనకాపల్లిలోని వీరాంజనేయ బ్లడ్ బ్యాంక్‌లకు పంపించి వారి రోగుల రక్తం అవసరాన్ని తీర్చుతున్నారు. గ్రూపులో సమాచారం చూసిన దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేస్తున్నారు. ఈ విధంగా సంవత్సర కాలంలో 49 మందికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడటమే

రక్తదానం కోసం నర్సీపట్నంలో వీఎస్ఎన్ వాట్సాప్ గ్రూప్



నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

కాకుండా దాత పేరుతో మొక్కనాటే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు.

విమర్శించిన వారే మా సేవలు గుర్తించి ముందుకు వచ్చారు

– వీరమాచినేని సందీప్, వాట్సాప్ గ్రూప్ ఎడ్మిన్, వీఎస్ఎన్ బ్లడ్ సర్వీస్, నర్సీపట్నం

రక్తదానం ఆవశ్యకత గుర్తించి సేవా సంకల్పంతో వీఎస్ఎన్ బ్లడ్ సర్వీసు పేరుతో వాట్సాప్ గ్రూప్ నిర్వహిస్తున్నారు. తొలి రోజుల్లో చాలా మంది గ్రూప్ గురించి విమర్శించారు. వాట్సాప్ గ్రూప్ ద్వారా తాము అందిస్తున్న సేవకు మంచి స్పందన వచ్చింది. విమర్శించిన సభ్యులతోనే రక్తం దానం చేయించాను. దాతల పేరుతో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాను.



ఎల్ఈడీ స్క్రీన్‌పై వీక్షిస్తున్న నేతలు

ప్రమాణ స్వీకారోత్సవం వీక్షణానికి ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు

కె.కోటపాడు, జూన్ 12 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కూటమి అభ్యర్థుల ప్రమాణ స్వీకారాన్ని ఎల్ఈడీ స్క్రీన్‌పై బుధవారం స్థానిక మండల కేంద్రం వెలుగు కార్యాలయంలో కె.కోటపాడు మండల ఎంపీడీవో టీఎస్‌కెఎస్ పట్నాయక్, కె.కోటపాడు మాజీ సర్పంచ్ డోకల లక్ష్మీ నరసింహమూర్తి, పార్టీ నాయకులు, ప్రభుత్వ సిబ్బంది వీక్షించారు. అనంతరం ఎంపీడీవో, సర్పంచ్, పార్టీ నాయకులు, ప్రభుత్వ సిబ్బంది, కార్యకర్తలు కేక్ కటింగ్ చేసి ఆనందించారు.

నర్సీపట్నంలో..

నర్సీపట్నం అర్బన్ : నర్సీపట్నం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రసారానికి ఎంపీడీఓ జాన్ లింకన్ టీవీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని వివిధ శాఖల అధికారులతో పాటు ఉమ్మడి శ్రేణులు పాల్గొని వీక్షించారు. జడ్పీటీసీ సుకల రమణమ్మ దంపతులు కూడా హాజరై ప్రసార కార్యక్రమాన్ని వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు.

బిగ్ స్క్రీన్‌పై ప్రమాణ స్వీకార ప్రత్యక్ష ప్రసారం



ప్రమాణ స్వీకారోత్సవం చూస్తున్న అధికారులు, డ్వాక్రా, ఉపాధి సిబ్బంది, మహిళలు

చోడవరం, జూన్ 12 : రాష్ట్రంలో చంద్రబాబు ప్రమాణస్వీకారం సందర్భంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో లైవ్ షో ఏర్పాటు చేశారు. మండల పరిషత్ సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన ఈ లైవ్‌షో కార్యక్రమాన్ని ఉపాధి హామీ పథకం అధికారులు సిబ్బంది, వెలుగు శాఖ కార్యాలయం మండల పరిషత్ సిబ్బంది డ్వాక్రా మహిళలు తిలకించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం క్లస్టర్ ఏపీడీ శ్రీనివాసరావు, ఏపీవో రుక్మిణిదేవి, ఈసీ కుమార్, వెలుగు ఏపీఎం కనకరాజు, పంచాయతీ ఈవో నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బంగారుమెట్టలో కూటమి నేతల ఉత్సాహం



స్వీట్లు తినిపించుకుంటున్న టీడీపీ నేతలు

బుచ్చెయ్యపేట, జూన్ 12 : చంద్రబాబునాయుడు సీఎంగా, పవన్ కల్యాణ్, నారా లోకేష్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన చేసిన వేళ మండల వ్యాప్తంగా ఎన్డీఏ కూటమి నేతల సంబరాలు అంబరాన్నంటాయి. బంగారుమెట్ట కూడలిలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కేక్‌ను కట్ చేసి చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కి అనుకూలంగా నినాదాలు చేశారు. కట్ చేసిన కేక్‌ను ఆనందోత్సవాలతో నేతలు ఒకరికొకరు తినిపించుకున్నారు. స్థానికులకు, పార్టీ కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. బుచ్చెయ్యపేటలో ఉపాధి పథకం కూలీలకు స్థానిక టీడీపీ యువకులు డ్రింక్ బాటిల్స్, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గేదెల సత్యనారాయణ, దేవర అప్పారావు, గొన్నా ఈశ్వరరావు, గంగరాజు, తమరాన దాసు, దొండా శ్రీను, సాయం అయ్యన్నదొర, శేషు, తమారన సింహాద్రిప్పుడు, జనసేనపార్టీ నాయకులు దొండా సన్యాసిరావు, దాడి సూర్యనాగశ్వరరావు, వీర్ల సురేష్, కుబిరెడ్డి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరంలో నేత్ర పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రోలుగుంట, జూన్ 12 : మండలంలోని రోలుగుంటలో స్థానిక పీపీసీఎస్ వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని పర్సన్ ఇన్‌చార్జి మడ్డు తాతబాబు ప్రారంభించారు. రోలుగుంటతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో రోగులు పాల్గొన్నారు. పాల్గొన్న రోగులకు నరాల చికిత్స కోసం, కంటి పైపొర చికిత్స కోసం, కంటి నీటి కాసుల చికిత్స, కంటి రెప్పల చికిత్స తదితర వాటిపై వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 81 మంది రోగులు పాల్గొనగా, వారందరికీ పరీక్షలు నిర్వహించి 38 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వీరందరికీ శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంపు మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంటకాలువల నిర్మాణానికి ప్రాధాన్యం : ఎంపీడీవో

చీడికాడ, జూన్ 12 : ఉపాధి హామీ పథకంలో పంట కాలువల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమివ్వాలని ఎంపీడీవో ఉమామహేశ్వరి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం వీఆర్పీలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంకో నెల రోజుల్లో వరినాట్లు వేసేందుకు అవకాశం ఉన్నందున రైతులకు అవసరమయ్యే పంటకాలువల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తూ, కోనాం జలాశయం పరిధిలో ఉన్నసాగునీటి కాలువల్లో పూడికలు తీయించాలని సూచించారు. ప్రతి రోజూ వేతనదారులను ఎక్కువగా వచ్చేలా చూసి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వేతనానికి తగ్గ పని చేయించాలని కోరారు. రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేసి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అంతకుముందు ఎంపీడీవో చాంబర్‌లో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పనులపై చర్చించారు. ఈ సమావేశంలో ఏపీవో సియ్యాద్రి నాగరాజు, ఈసీ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్‌లు బిఎస్.పాత్రుడు, ఎర్రునాయుడు, మోహన్ పాల్గొన్నారు.


సభా వేదిక వద్ద కోలాహలం




వేదిక ముందు నందమూరి, నారా కుటుంబ సభ్యులతో హీరో రామ్‌చరణ్

చంద్రబాబు అనే నేను..

ప్రభంజనమై మేమూ..

కేసరపల్లిలో ఘనంగా టీడీపీ కూటమి మహా పట్టాభిషేకం

ప్రజాతీర్పునకు పట్టాభిషేకమైంది. జనం ప్రభంజనమై పండుగలా కదిలింది. అభిమాన కోలాహలం నడుమ కేసరపల్లి జయకేతనమై ఎగరగా, గన్నవరం జనవరమై జేజేలు పలికింది. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అనే మాటతో అభిమాన సంబరాలు అంబరాన్నంటాయి. కేసరపల్లిలో బుధవారం ఉదయం జరిగిన టీడీపీ కూటమి ప్రమాణస్వీకార మహోత్సవానికి అతిరథ మహారథులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి


వేదికపై బాలకృష్ణ, రజనీకాంత్ దంపతులు, చిరంజీవి

బస్సెక్కిన అభిమానం








చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండగా నందమూరి రామకృష్ణ భావోద్వేగం, బాలకృష్ణ, భువనేశ్వరి అనురాగం, సభావేదిక వద్ద నాగలితో ఓ రైతు ప్రదర్శన


జనసేన, టీడీపీ, బీజేపీ స్టిక్కరింగ్ స్కూటర్లపై వినూత్నంగా..

క్రైం... crime news

చెట్టుపై నుంచి జారిపడి గిరిజనుడి మృతి


బొంజుబాబు (ఫైల్)

గూడెంకొత్తవీధి, జూన్ 12: మండలంలోని గూడెంకొత్తపాకలు గ్రామానికి చెందిన ఓ గిరిజనుడు చెట్టు నుంచి జారి పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గూడెంకొత్తపాకలు గ్రామానికి చెందిన గెమ్మెలి బొంజుబాబు (25) బుధవారం మధ్యాహ్నం తన పొలంలోని మామిడి చెట్టు ఎక్కి కాయలు కోస్తున్నాడు. ఈ క్రమంలో కాలు అదుపు తప్పి కిందకు పడిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ బొంజుబాబును కుటుంబ సభ్యులు వెంటనే గూడెంకొత్తవీధి ఆస్పత్రికి ప్రైవేటు వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

కలప పట్టివేత.. కోత మిషన్ సీజ్


దాడుల్లో పట్టుబడిన గన్నర దిమ్మలతో అటవీ శాఖ సిబ్బంది

కొయ్యూరు, జూన్ 12: మండలంలో జోగంపేట సోలాబు శివారులో బుధవారం మధ్యాహ్నం అటవీ శాఖ అధికారులు 13 గన్నర దిమ్మలను పట్టుకున్నారు. అలాగే కకోత మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కొయ్యూరు అటవీ సెక్షన్ పరిధిలో కలప అక్రమ రవాణాకు వీలుగా నిల్వ చేసినట్టు అందిన సమాచారం మేరకు కొయ్యూరు, రాజేంద్రపాలెం, కాకరపాడు, సోలాబు, జోగంపేట తదితర గ్రామాల్లో అటవీ శాఖ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడులలో సోలాబు-జోగంపేటల మధ్య అక్రమంగా నిల్వ చేసిన 13 గన్నర దిమ్మలతో పాటు కలప కోత మిషన్‌ను పట్టుకున్నారు. వీటిని కాకరపాడు అటవీ డిపోకు తరలించి కేసు నమోదు చేసినట్టు రేంజర్ తెలిపారు. ఈ దాడులలో పెదవలస, చింతపల్లి రేంజ్‌ల పరిధిలోని అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

విశాఖపట్నం, జూన్ 12: బీచ్ రోడ్‌లో తొట్లకొండ తీరంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కొంతకాలంగా ఆ వ్యక్తి మంగమారిపేట, నగరపాలెం పరిసర గ్రామాల్లో భిక్షాటన చేసుకుని జీవించేవాడు. బుధవారం ఉదయం తొట్లకొండ తీరంలో ఉన్న ఒక రెస్టారెంట్ సమీపంలో ముళ్ల పొదల వద్ద తాడుతో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రమేష్ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

కూరగాయలు కొనలేం.. తినలేం!

భారీగా పెరిగిన ధరలు
- కిలో టమాటా రూ.60.. కిలో అల్లం రూ.260
- బెండ, ఉల్లి, మిర్చి, వంగ రూ.40
- వినియోగదారుల గగ్గోలు

బుచ్చెయ్యపేట/నాతవరం, జూన్ 12: మొన్నటి వరకు ఎండలు భగభగ మండిపోతే... ఇప్పుడు కూరగాయల ధరలు భగభగ మంటున్నాయి. వాటి జోలికి వెళ్లాలంటేనే వినియోగదారులు హడలిపోతున్నారు. దీంతో పరిస్థితి ఏం కొనేటట్టు... తినేటట్టు లేదని వాపోతున్నారు.


వడ్డాది మార్కెట్‌లో కూరగాయలు

మార్కెట్‌లో ఒక్కసారిగా కూరగాయాల ధరలు భారీగా పెరిగిపోయాయి. పట్టణాల్లోనే కాదు గ్రామీణ ప్రాంతాల్లో అదే పరిస్థితి. ఎన్నడూ లేని రీతిలో ధరలు పెరిగిపోయాయి. సామాన్యులు కొనుగోలు చేయలేని విధంగా ధరలు ఆకాశనంటడంతో ఆందోళన చెందుతున్నారు. మొన్నటి వరకు రూ.100 తీసుకుని వెళ్తే నాలుగైదు రకాల కూరగాయలు వచ్చేవి. ఇప్పుడు రూ.500 తీసుకువెళ్లినా సంచి నిండని పరిస్థితి నెలకొంది. దీంతో సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. అధిక రేట్లతో కొనలేకపోవడంతో కూరగాయల మార్కెట్లు వెలవెలపోతున్నాయి. గత వారం కిలో టమాటా రూ.25 ఉండగా, ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.60కి అమ్ముతున్నారు. అలాగే గత వారం కిలో పచ్చిమిర్చి రూ.30 అమ్మగా, ప్రస్తుతం మార్కెట్‌లో రూ.60కి చేరింది. కొత్తిమీర కట్ట రూ.12 ఉండగా, ప్రస్తుతం మార్కెట్‌లో కట్ట రూ.30కు అమ్ముతున్నారు. అల్లం ధర సామాన్య ప్రజలు భయాందోళన చెందేలా కిలో రూ.260కు చేరింది. అలాగే బెండకాయలు రూ.40, ఉల్లిపాయలు రూ.40, పచ్చిమిర్చి రూ.40, వంకాయలు రూ.40, క్యారెట్ రూ.42 ధరలు పలుకుతున్నాయి. వీటి ధరలను చూసి వినియోగదారులు షాక్ అవుతున్నారు. నెల రోజుల క్రితం ఉన్న ధరలతో పోల్చుకుంటే ప్రస్తుతం ధరలు డబల్ కావడంతో వామ్మో అని నోరు వెల్లబెడుతున్నారు. అధిక ధరల కారణంగా భోజనంలో కూరగాయలను పచ్చళ్ల మాదిరిగా తీసుకోవాల్సి వస్తున్నదని వినియోగదారులు వాపోతున్నారు.


నాతవరంలో విక్రయానికి ఉంచిన పచ్చిమిర్చి

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం


న్యాయ అవగాహన సదస్సు మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ వీర రాఘవేంద్రరావు

కశింకోట, జూన్ 12: మండలంలోని నర్సింగబిల్లిలో గల జీడిపిక్కల పరిశ్రమలో బుధవారం న్యాయ శాస్త్ర అవగాహన సదస్సు ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఎలమంచిలి అడిషనల్ జడ్జి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ టి.వీర రాఘవేంద్రరావు ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ముఖ్యంగా చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని వివరించారు. సన్ ఫుడ్ ఫ్యాక్టరీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఏజీపీ డి.వెంకట్రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.నూకరాజు, కార్యదర్శి బి.శంకరరావు, ఉపాధ్యక్షుడు పి.వి.రమణ, ఫ్యాక్టరీ యజమాని బి.అనీల్‌కుమార్, కార్మిక శాఖాధికారి ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

అనకాపల్లి టౌన్, జూన్ 12: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు గత రెండు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు వాపోయారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం, నక్కపల్లి, మాడుగుల, చోడవరం, కోటపాడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వీరిపై పనిభారం అధికంగా ఉందన్నారు. గత రెండు నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. నర్సీపట్నం ఆస్పత్రిలో పనిచేసే కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి వివరాలు కూడా అందించడం లేదన్నారు. కనీస వేతనం రూ. 16వేలు ఇవ్వాల్సి ఉండగా ఎక్కడా అమలు చేయడం లేదని ఆరోపించారు. తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలి

- కాంగ్రెస్ నాయకుల డిమాండ్


ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

అనకాపల్లి టౌన్, జూన్ 12: రాష్ట్రానికి ప్రధాని మోదీ ప్రత్యేక హోదా కల్పించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని గాంధీనగరం మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులు చేతబట్టి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం లేదని ప్రధాని హామీ ఇవ్వాలన్నారు. ప్రస్తుతం కేంద్రంలో అత్యంత కీలక స్థానంలో ఉన్న టీడీపీ మరింత చొరవ చూపి రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బోయిన భానుమూర్తి యాదవ్, కాళ్ల సత్యనారాయణ, సేనాపతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా గిడుతూరు పాఠశాల భవనం

- రెండేళ్లుగా కొనసా...గుతున్న నిర్మాణం


అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం ఇదే...

మాకవరపాలెం, జూన్ 12: గిడుతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. నాడు-నేడు పథకంలో భాగంగా మంజూరైన పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు రెండేళ్లగా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ పాఠశాలలో సుమారు 250 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి తరగతి గదులు కొరత కారణంగా ఎప్పటి నుంచో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అదనపు తరగతుల నిర్మాణానికి 2022లో నాడు-నేడు పథకం కింద సుమారు రూ.47 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో నిర్మాణ పనులు మొదలపెట్టారు. అయితే గత రెండేళ్లుగా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. పాఠశాల భవన నిర్మాణ పనులపై అధికారులు కనీసం పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పునఃప్రారంభమైనా భవనం అసంపూర్తిగానే ఉండడం సరికాదని, ఇప్పటికైనా పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.

సత్యనారాయణస్వామి దేవస్థానం పాలకవర్గం రాజీనామా


ఆలయ అధికారులకు రాజీనామా పత్రం ఇస్తున్న చైర్మన్ కేఎం నాయుడు

అనకాపల్లి టౌన్, జూన్ 12: ఇక్కడి సుంకరమెట్ట జంక్షన్‌లోని రమా సమేత సత్యనారాయణస్వామి, సూర్యనారాయణస్వామి ఆలయ పాలకమండలి బుధవారం రాజీనామా చేసింది. ఈ మేరకు ఆలయ ఈవోకు చైర్మన్ కర్రి మహాలక్ష్మినాయుడు, ధర్మకర్తలు పెంటకోట అప్పలనాయుడు, విజ్జపు వాసు ముకుంద, మారిశెట్టి శ్రీను, తాడి నాగలక్ష్మి, తగరంపూడి నరసింగరావులు తమ రాజీనామా పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో వైసీపీ ఓటమి చెందడంతో తమ పాలకవర్గం రాజీనామా చేసినట్టు వారు తెలిపారు.